# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆదాయ వనరులు పెంచుకునేందుకు అన్ని మార్గాలపైన దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.
- రాష్ట్రంలో రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.
- శాసన సభ సమావేశాలు ఏడాదిలో కనీసం 60 రోజులైనా నిర్వహించాల్సిన అవసరం ఉందని సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.
- భారీ వర్షాల నేపధ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు.
- అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులలో రాష్ట్రంలో పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

===========================

ఆదాయ వనరులు పెంచుకునేందుకు అన్ని మార్గాలపైన దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ ఆదాయార్జన శాఖల అధికారులతో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర నిధుల విషయంలో దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ టాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా పన్ను వసూళ్లను పర్యవేక్షించాలన్నారు. సేవా రంగం ద్వారా ఎక్కువ పన్ను ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో చేపట్టే కాంట్రాక్టు పనులకు వినియోగించే వాహనాల పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులను రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పన్ను చెల్లింపులు సక్రమంగా జరిగేలా ఆర్టీజీఎస్, సీసీ కెమెరాలను ఉపయోగించాలని ముఖ్యమంత్రి సూచించారు.

===========================

రాష్ట్రంలో రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అమరావతిలోని రాష్ట్ర శాసన మండలి ప్రాంగణంలో రేపు ఉదయం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శాసన మండలి అధ్యక్షులు కొయ్యే

మోషేన్ రాజు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అదేవిధంగా శాసన సభ ప్రాంగణంలో సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు జాతీయ జెండాను ఆవిష్కరింస్తారని పేర్కొన్నాయి. రాష్ట్ర సచివాలయం మొదటి భవనం వద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొననున్నారు. నేలపాడులోని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రాంగణంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పాల్గొంటారని అధికార వర్గాలు వెల్లడించాయి.

============================

శాసనసభ సమావేశాలు ఏడాదిలో కనీసం 60 రోజులైనా నిర్వహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. అప్పుడే ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపై విస్తృతంగా సభలో చర్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోటీ 50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక హైస్పీడ్ ముద్రణా యంత్రాలను అసెంబ్లీ భవనంలో సభాపతి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రశ్నోత్తరాల సమయంలో పార్టీల సంఖ్యా బలాన్ని బట్టి ప్రశ్నలు అడిగే అవకాశం ఇస్తున్నామని చెప్పారు.

(వాయిస్ 28 సెకన్లు)

============================

అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గుంటూరు, కృష్ణా జిల్లాలలో భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంది. వేల ఎకరాలలో పంటలు నీటమునిగాయి. భారీ వర్షాల దృష్ట్యా పలు జిల్లాల్లో విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఇదిలా ఉండగా భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... వరద ముప్పు ఉన్న ప్రాంతాలలో తగిన చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. అలాగే అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

============================

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరికొద్ది సేపట్లో జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగం ఆకాశవాణి నెట్‌వర్క్ అన్ని ఛానెల్స్ తో పాటూ దూరదర్శన్ కేంద్రాల్లోనూ రాత్రి 7 గంటల నుండి ప్రసారమవుతుంది. ఇక ఆకాశవాణి ప్రాంతీయ నెట్ వర్క్ ద్వారా రాత్రి 9 గంటల 30 నిమిషాలకు రాష్ట్రపతి ప్రసంగానికి ప్రాంతీయ భాషల్లో అనువాదం ప్రసారమవుతుంది.

విరామం

============================

పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఈ రోజు నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి శ్రీనివాస వర్మ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. 400 అడుగుల జాతీయ జెండాతో సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

============================

ప్రకాశం బ్యారేజి నుండి 5 లక్షల 66 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తూ.. రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు ఈ రోజు జారీ చేశారు. ఈ నేపధ్యంలో దిగువన ఉన్న కొల్లిపర, గోలిడోంక తదితర మండలాల్లో పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో కలసి పర్యటించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... ఇప్పటి వరకు 7 వేల మంది రైతులు వేసిన 14 వేల ఎకరాల పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ముంపు గ్రామాల్లో అన్ని రకాల నిత్యావసర సరుకులు, వైద్య సదుపాయాలతో పాటు రెండు పడవలను కూడా అందుబాటులో ఉంచామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=============================

వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జెడ్.పి.టి.సి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హేమంత్ రెడ్డిపై 6,716 ఓట్ల ఆధిక్యతతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి విజయం సాధించగా ఒంటిమిట్ట జడ్.పి.టి.సి ఉప ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి పైన టీడీపీ అభ్యర్థి అద్దలూరి ముద్దు కృష్ణ రెడ్డి 6,267 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.

=============================

రాష్ట్ర సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల స్థానంలో జూట్ సంచులను వినియోగాన్ని ప్రోత్సహిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. సచివాలయం ప్రాంగణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్స్ స్టాల్స్ ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రేపటి నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా రాష్ట్ర సచివాలయాన్ని తీర్చిదిద్దే కార్యక్రమం మొదలవుతుందన్నారు. వచ్చే ఏడాది జూన్ 5వ తేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ప్రభుత్వ ఆలోచనల మేరకు ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

=============================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల వాహనాలకు రేపటి నుండి ఫాస్టాగ్ విధానాన్ని అమలు చేయనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పేర్కొంది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వివిధ వాహనాలలో చేరుకొనే భక్తులకు మెరుగైన భద్రతా ప్రమాణాలతో పాటు రద్దీ నివారణా చర్యలు చేపట్టేందుకు ఫాస్టాగ్‌ను తప్పనిసరి చేసినట్లుగా టీటీడీ వివరించింది. ఇకపై ఫాస్టాగ్ లేని వాహనాలను తిరుమలకు అనుమతించబోమని స్పష్టం చేసింది. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

=============================

అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఉత్తర కోస్తా జిల్లాల్లో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియచేస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

=============================
=============================